సాక్షి
అనకాపల్లి
గురువారం । 23 । జనవరి । 2025



అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు ఉత్సవంలా సాగింది. వివిధ రకాల పిండి వంటలు, మిఠాయిలు, కూరగాయలు, నూతన వస్త్రాలు, ఫర్నిచర్, బెల్లం దిమ్మలు, అరటి గెలలను మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలతో పట్టణ పురవీధులు కళకళలాడాయి.

వైభవంగా వార్షిక కల్యాణం

8లో

కూటమి ట్యాక్స్

నెలకు రూ. 2 కోట్లు

రోజుకు 1000 ట్రిప్పులు....
ఇందులో 150 పోను...
మిగిలిన 850 ట్రిప్పులకు
రూ.22 వేల చొప్పున
మొత్తం రూ.1.87 కోట్లు!!

ఇవేం లెక్కలు అనుకుంటున్నారా.... అనకాపల్లి నియోజకవర్గంలో **అక్రమ మైనింగ్** వ్యవహారంలో కూటమి **నేతలు చేస్తున్న** నెలవారీ వసూళ్ల లెక్కలివి. **మైనింగ్ శాఖతో** పాటు రవాణా, పోలీసు, **రెవెన్యూ శాఖల** అధికారులకు నెలనెలా **ముడుపులు** ముడుతున్నాయనీ, అందుకే **అనేక** అవకతవకలు జరుగుతున్నా **చర్యలు** తీసుకోవడం లేదని విమర్శలు **వినిపిస్తున్నాయి.**



మార్టూరు క్వారీలో మైనింగ్ కార్యకలాపాలు

అనకాపల్లి మైనింగ్‌లో వసూళ్ల పర్వం

- చక్కర్లు కొడుతున్న లారీలు రోజుకు 1000
- ట్రిప్పునకు రూ.22 వేల వంతున వసూళ్లు
- అందులో ఎంపీ రమేష్ లారీలకు మినహాయింపు
- 32 టన్నుల లారీలో 50 టన్నుల బోల్డర్లు
- ఒక్కో లారీలో 14–18 టన్నుల మేర అధిక లోడు
- అధికార, అనధికారిక క్వారీల నుంచి అడ్డగోలు వసూళ్లు
- పట్టించుకోని వివిధ శాఖల అధికారులు

సాక్షి ప్రతినిధి, **విశాఖపట్నం:**

కొత్త ప్రభుత్వంలో సరికొత్త **టిప్పర్లు.. ఎక్కడా** తేడా రాకుండా ఎంచక్కా వాటాలు.. ఎవరూ నోరు తెరవకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు.. కూటమి ప్రభుత్వంలో మైనింగ్ దందా ఎంత పకడ్బందీగా సాగిపోతోందో చూడండి.. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న వివిధ క్వారీల ద్వారా రోజుకు 1,000 ట్రిప్పుల్లో బండరాళ్లు తరలిపోతున్నాయి. వివిధ అధికార, అనధికార క్వారీల నుంచి మునగపాక మీదుగా రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ రాంబిల్లిలోని నావికాదళ పనుల వరకూ ప్రతి రోజూ చక్కర్లు కొడుతున్నాయి. 32–36 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లలో ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్నా ఈ టిప్పర్ల వైపు అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇందుకు కారణం ప్రతి నెలా ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేల చొప్పున కూటమి నేతలు ట్యాక్స్ వసూలు చేస్తుండటమే. ఇందులో అనకాపల్లి ఎంపీకి చెందిన సీఎం రమేష్ ట్రిప్పులను మినహాయించి మిగిలిన 850 ట్రిప్పులు తోలుతున్న వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి నెలకు ఠంచనుగా రూ.22 వేల మేర వసూలు చేస్తున్నారు. ఈ లెక్కలన్నీ అనకాపల్లికి చెందిన కూటమి నేత బంధువు చూస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక లోడుతో వస్తున్న ఈ వాహనాల రాకపోకలపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నెలవారీగా వసూలవుతున్న మొత్తం రూ.1.87 కోట్లలో కూటమి నేతలతో పాటు మైనింగ్, రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులకూ భారీగా వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దగ్గరుండి మరీ పర్యవేక్షణ..!

అనకాపల్లి నియోజకవర్గంలో 20 క్వారీలకు అధికారికంగా అనుమతి ఉంది. మరో 30 అనధికారిక క్వారీలను కలుపుకుని మొత్తం 50 క్వారీల నుంచి ప్రతి రోజూ సగటున 1,000 ట్రిప్పుల బండరాళ్లు తరలిపోతున్నాయి. రాంబిల్లి వద్ద నావికాదళానికి సంబంధించి అణు జలాంతర్గాముల కోసం ప్రత్యేకంగా ఐఎన్ఎస్ వర్ష పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సముద్రంలో కొన్ని కిలోమీటర్ల మేర దారిని నిర్మించాల్సి ఉంటోంది. ఇందుకోసం భారీ బండరాళ్లతో నింపే పనులు జరుగుతున్నాయి. వీటి కోసం అవసరమైన బండరాళ్లను ప్రధానంగా అనకాపల్లి నియోజకవర్గం నుంచి తరలిస్తున్నారు. ఇందుకుగానూ అనకాపల్లి నియోజకవర్గంలోని జంగాలపాలెం, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బండరాళ్లను తీసుకువెళుతున్నారు. ప్రధాన కాంట్రాక్టరుకు అవసరమైన బండరాళ్లను సరఫరా చేసే బాధ్యతలను పలువురు సబ్ కాంట్రాక్టు కింద తీసుకున్నారు. ఇందులో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో సహా పలువురు స్థానిక కాంట్రాక్టర్లు, కూటమి నేతలు ఉన్నారు. వీరికి చెందిన భారీ టిప్పర్లకు బండరాళ్లను ఎత్తుతున్నారు. నిబంధనల మేరకు ఆయా టిప్పర్ల సామర్థ్యాన్ని బట్టి 32 నుంచి 36 టన్నుల వరకు మాత్రమే తరలించాల్సి ఉంటుంది. అయితే, వీటిలో 50 టన్నుల మేరకు బండరాళ్లను తరలిస్తున్నారు. ఈ అదనపు లోడును చూసీ చూడనట్టుగా ఉండేందుకుగానూ నెలకు ట్రిప్పునకు రూ.22 వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతి రోజూ ఎన్ని ట్రిప్పులు వెలుతున్నాయనే లెక్కలను చూసేందుకు కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ పర్యవేక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయనకు సంబంధించిన వ్యక్తులను ఆయా క్వారీల వద్ద ఉంచి... లెక్కలు కడుతున్నారు. లెక్కలను చూసుకుని ప్రతి నెలా వసూళ్లకు తెగబడుతున్నట్టు తెలుస్తోంది.

అందరికీ వాటాలే..!

ఈ అనధికారి అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతలతో పాటు అధికారులకు కూడా ప్రతి నెలా వాటాలు అందుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను చూసీ చూడనట్టుగా ఉండేందుకు వీలుగా రవాణాశాఖ అధికారులకు ప్రతి నెలా మామూళ్లు ముట్టచెబుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక అనధికారిక క్వారీల్లో జరుగుతున్న మైనింగ్‌ను పట్టించుకోకుండా ఉండేందుకుగానూ మైనింగ్ అధికారులకూ భారీగా ముడుతోందన్న విమర్శలున్నాయి. అక్రమ మైనింగ్‌తో పాటు అధిక లోడుతో భారీగా రాయల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. అయినప్పటికీ వీరికి చీమ కుట్టినట్టు కూడా ఉండటం లేదు. ఇక మైనింగ్ విజిలెన్స్ అధికారులు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా దాడులు చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు గత 7 నెలల కాలంలో ప్రయత్నించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్థానిక పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ ఇలా అన్ని విభాగాల అధికారులకు వాటాల లెక్కన పంచుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరి వాటా ఇచ్చిన తర్వాత మిగిలిన భారీ మొత్తాన్ని సదరు కూటమి నేత బంధువు జేబులోకి వెళుతోంది.

ఏకంగా కొత్త టిప్పర్లు!





ఈ వ్యవహారాలు సజావుగా సాగడంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.... గత కొద్ది రోజులుగా కొత్త టిప్పర్లు ఈ మైనింగ్ క్వారీల నుంచి రాంబిల్లి వరకూ హోరెత్తిస్తున్నాయి. కేవలం ఈ బండరాళ్లను సరఫరా చేసేందుకే కొత్తగా సీఎం రమేష్‌తో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులు 100 వరకూ కొత్త టిప్పర్లను కొనుగోలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు బండరాళ్లను తీసుకెళుతున్న పలు ఇతర సంస్థలకు చెందిన భారీ టిప్పర్లలో కొన్నింటికి నెంబరు ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం. అయినప్పటికీ రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతూ.... ఓపెన్ బ్లాస్టింగ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతున్నప్పటికీ అటవీ, పర్యావరణశాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక కూటమి నేతల బలమైన ఒత్తిళ్లే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కలెక్టర్ విజయ కృష్ణన్



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు అభినందనలు

తుమ్మపాల: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్) పర్సన్ ఇన్‌చార్జిగా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు వ్యవసాయం, సహకార శాఖ ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఫర్ కోఆపరేటివ్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ శాఖ ప్రతిపాదించిన మేరకు ప్రభుత్వం ఆర్ఈసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.శ్యామల, ఆర్ఈసీఎస్ ప్రాజెక్టు ఇంజినీర్ జె.ప్రసాదరావు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జిల్లా అధికారి శచీదేవి

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం పారిశ్రామికవేత్తలు కృషి చేయాలని గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి కోరారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో పారిశ్రామికవేత్తలకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై రెండు రోజుల అవగాహన సదస్సుల్లో భాగంగా మొదటి రోజు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కంపెనీల ఏర్పాటు కోసం పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి రాయితీలు వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గోవిందరావు, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ప్రగతి సాధ్యం



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- అభివృద్ధిలో విశాఖతో పోటీ పడాలి
- గుంతల మరమ్మతులు ఈ నెలాఖరులోగా పూర్తి
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

సాక్షి, అనకాపల్లి: సమష్టి కృషితోనే జిల్లా ప్రగతి సాధ్యమని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం (డీఆర్సీ) జరిగింది. కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, జెడ్పీ చైర్పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరైన ఈ సమావేశంలో పంచాయతీరాజ్, డ్వామా, జిల్లా పరిషత్, గృహ నిర్మాణ, రహదారులు, జలవనరులు, భూగర్భ గనుల శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తలసరి ఆదాయం, స్థూల దేశీయ ఉత్పత్తిలో అనకాపల్లి జిల్లా 12వ స్థానంలో ఉందన్నారు. మొదటి స్థానంలో ఉన్న విశాఖపట్నం జిల్లాతో పోటీపడేలా అందరం కృషి చేయాలని చెప్పారు. జిల్లాలో రహదారుల గుంతలకు ఈ నెలాఖరులోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనకాపల్లిలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు కోసం ప్రతి మండలంలోనూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు, ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, పంచకర్ల రమేష్‌బాబు, డీఆర్వో సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పట్టదా?

డీఆర్సీ సమావేశంలో ప్రొటోకాల్ పాటించలేదు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి ఆహ్వానం లేదు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు సమావేశం మధ్యాహ్నం 2.45 గంటలకు అని చెప్పి, సాయంత్రం 5 గంటలకు ప్రారంభించారు. అంతవరకు ఆమె వేచి ఉండాల్సి వచ్చింది. సాధారణంగా డీఆర్సీ సమావేశం ముగిశాక విశేషాలను ఇన్‌చార్జి మంత్రి ప్రెస్‌మీట్‌లో వివరిస్తారు. ఈసారి ప్రెస్‌నోట్‌తో సరిపెట్టారు. ఎన్నడూ లేనివిధంగా సమావేశానికి ముందు ప్రెస్‌మీట్ పెట్టి తమ ప్రభుత్వ ఘనతను చాటుకొనే ప్రయత్నం చేశారు.

సంక్షేమ పథకాలు ఆలస్యమైన మాట వాస్తవమే

సాక్షి, అనకాపల్లి: సంక్షేమ పథకాల అమలు ఆలస్యమైన మాట వాస్తవమేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అంగీకరించారు. డీఆర్సీ సమావేశానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా, జూన్‌లో తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు అనకాపల్లి జిల్లాకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో సుమారు రూ.2 లక్షల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పంచాయతీల పరిధిలో రూ.151 కోట్లతో 1200 పనులు జరుగుతున్నాయని, వీటిలో 60 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 25,800 ఇళ్లు మంజూరు చేశామని, వీటిలో ఇప్పటి వరకూ 8,100 ఇళ్లు పూర్తవ్వగా.. మరో 17 వేలు ఇళ్లు త్వరలో నిర్మించనున్నారన్నారు.



తగరంపూడిలో టీడీపీ నాయకుడి తోటలో కోడిపందేలు, (ఇన్‌సెట్) జోరుగా గుల్లాట

- పండగలు, తీర్థాల పేరిట యథేచ్ఛగా నిర్వహణ
- కూటమి నేతల కనుసన్నల్లో జోరుగా జూద క్రీడలు
- లాలం కోడూరు, తగరంపూడిలో చేతులు మారిన రూ.లక్షలు
- పత్తా లేని పోలీసులు



కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

రాంబిల్లి (యలమంచిలి)/తుమ్మపాల: పండగలు, తీర్థాల ముసుగులో జిల్లా అంతటా **జోరుగా జూద క్రీడలు సాగుతున్నాయి. పోలీసులు వస్తారనే భయం** లేకుండా బ**హిరంగంగా పెద్ద ఎత్తున కోడి పందేలు, గుండాటలు నిర్వహించ**డంతో రూ.లక్షల్లో డబ్బు చేతులు మారింది. సంక్రాంతి వెళ్లి వారం రోజులు దాటినా రాంబిల్లి మండలం లాలం కోడూరు, అనకాపల్లి మండలం తగరంపూడి తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్భయంగా నిర్వహిస్తున్నారు. లాలం కోడూరు గ్రామానికి చెందిన కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన జూద క్రీడల విషయం తెలిసినప్పటికీ పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. పదుల సంఖ్యలో కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు కట్టడంతో మూగ జీవుల తలలు తెగిపడ్డాయి. పలువురు కూలీలు, పేద వర్గాలకు చెందిన వారు గుండాటలో సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితికి చేరుకోవడం కనిపించింది. కోడి పందేల శిబిరం వద్ద భోజనాలు, అల్పాహారాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. మద్యం ఏరులైపారింది. జూద క్రీడల్లో డబ్బులు పోగొట్టుకున్నవారి మధ్య ఘర్షణలు, తోపులాటలు, కొట్లాటలు చేసుకున్నాయి. లాలంకోడూరులో పెద్ద ఎత్తున కోడిపందేలు జరుగుతున్నాయని తెలుసుకొని వెళ్లిన కొందరు మీడియా ప్రతినిధులపై గ్రామానికి చెందిన కొందరు కూటమి నేతలు జులుం ప్రదర్శించారు. లాలం ఎరికిరెడ్డి నాయుడు ఆదమ్మ తీర్థంలో పెద్ద ఎత్తున జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా రాంబిల్లి పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు.

జేబులు ఖాళీ

తగరంపూడిలో గ్రామదేవతల పండగల పేరుతో యువతను జూదంలోకి దింపి జేబులు ఖాళీ **చేయించేస్తున్నారు. వీరికి కూటమి నాయకులు తోడవడంతో బహిరంగంగానే బరితెగించి కోళ్లకు కత్తులు కట్టి పోటీలు పెడుతున్నారు. తగరంపూడిలోని సీనియర్ టీడీపీ నాయకుడి మామిడితోటలో కోడి పందేల డెన్‌ను ఏర్పాటు** చేశారు. గత మూడు రోజుల నుంచి పేకాట, గుల్లాట శిబిరాలను ఏర్పాటుచేసి యువతను జూదం మత్తులోకి నెట్టేశారు. తగరంపూడికి స్వాగతం అంటూ గ్రామ ముఖద్వారంలోనే బుధవారం ఉదయం కోడి పందేల శిబిరాలను ఏర్పాటు చేశారు. వందకుపైగా కోడి పందేలు నిర్వహించారు. వీటితోపాటు ఆరు శిబిరాల గుల్లాట, పేకాట శిబిరాలను నిర్వహించినా పోలీసులు కన్నెత్తి కూడా చూడలేదు. లక్షల్లో నగదు చేతులు మారింది. కొందరు అప్పులు చేసి మరీ పంతానికి పందేలు ఆడారు. సాయంత్రం వరకు జరిగిన ఆటల్లో దాదాపు రూ.5 లక్షల వరకు పందేలు జరిగాయి.



లాలంకోడూరు సమీపంలో బరి వద్ద జన సందోహం

క్లుప్తంగా

విశాఖ చేరుకున్న 'షార్జా' బాధితులు

గోపాలపట్నం: ఉద్యోగాల కోసం షార్జా వెళ్లి, అక్కడ ఉద్యోగం రాకపోవడంతో ఇబ్బందుల్లో పడిన బాధితులు, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో సీపీతో కలిసి బాధితులు మీడియాకు తెలిపిన వివరాలు.. గాజువాక ఆటోనగర్లోని మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చి, దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న ప్రకటన చూసి అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పీకే గూడేనికి చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ, గార రాజేష్, పైలా రామస్వామి, శ్రీకాకుళం జిల్లా కంచిలికి చెందిన కాళ్ల వెంకటరావు, విశాఖలోని పెదగంట్యాడ సీకువానిపాలేనికి చెందిన గెద్దాడ లోకేష్‌లు ఆ సంస్థను సంప్రదించారు. ఏజెంట్లు దుర్గాప్రసాద్ అలియాస్ ప్రసాద్, చందులు మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపికైన వీరికి విశాఖవెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చారు.గతేడాది నవంబర్ 12న షార్జాలోని క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో వెల్డర్ ఉద్యోగాలకు పంపారు. అక్కడికి చేరాక వీరికి 6జీ వెల్డింగ్ కాకుండా 3జీ వెల్డింగ్‌ఇచ్చి పరీక్షించారు. అందులో అర్హత పొందకపోవడంతో లేబర్ ఉద్యోగాలిచ్చారు. వీరంతా టూరిస్ట్ వీసాతో వెళ్లడం వల్ల, కాలపరిమితి ముగిస్తే ఇబ్బందుల్లో పడతామనే ఆందోళనతో ఏజెంట్లను సంప్రదించారు. ఏజెంట్లు సకాలంలో స్పందించక పోవడంతో, విశాఖ సీపీనంబర్ (7995095799)లో తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన సీపీ ఏజెంట్ల ద్వారా ఈ ఐదుగు రిని విశాఖకు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. నగరానికి చేరుకున్న వీరు సీపీ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

కశింకోట: గంజాయి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ అనకాపల్లి అదనపు జిల్లా కోర్టు జడ్జి నందనవనం శ్రీవిద్య బుధవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని తీడ శివారు కచ్చర్లపాలెం కూడలి వద్ద రోడ్డుపై 2013 నవంబర్ 12న అప్పటి ఎస్‌ఐ పి.శ్రీనివాసరావు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో తరలిస్తున్న 60 కిలోల గంజాయి పట్టుబడింది. కారు డ్రైవర్ దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.నేరం రుజువు కావడంతో అనకాపల్లి అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య నిందితుడికి కఠిన శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు. ఈకేసులో గంజాయి పట్టుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్. వీర కృష్ణ, ప్రస్తుత సీఐ అల్లు స్వామినాయుడు, కోర్టు మానిటరింగ్ విభా గం సిబ్బందికి ఎస్పీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

చోడవరం: అక్రమంగా మద్యం కలిగిన ఒక వ్యక్తిని అరెస్టుచేసి, 31మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. డోలవాణిపాలెంలో మద్యం బెల్టుషాపులో ఉన్న ఈ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడినిఅరెస్టు చేశామని ఎస్‌ఐ చెప్పారు.


చింతామణి గణపతి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి

చింతామణి గణపతి ఆలయం (ఇన్‌సెట్) చింతామణి గణపతి ఆలయంలో సీతారాముల విగ్రహాలు

కోరిన కోర్కెలు తీర్చే
చింతామణి గణపతి

- నేడు దత్త క్షేత్రంలో 32 గణపతుల ప్రతిష్ట
- 1008 మంది దంపతులతో అనఘా వ్రతాలు

అనకాపల్లి: విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే స్వామి వినాయకుడు. అందుకే గణనాథుని దేవతలు సైతం ఆరాధిస్తారు. దేశవ్యాప్తంగా గణేశునికి ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అనకాపల్లి మండలం జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లిలో గల చింతామణి గణపతి ఆలయం ప్రత్యేకమైనది. గణపతి సచ్చిదానంద స్వామీజీ ఇక్కడ చింతామణి గణపతిని 2012 జనవరి 25న ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి భక్తుల కోరినకోర్కెలు తీర్చే గణపతిగా స్వామి విరాజిల్లుతున్నారు. అనఘా దత్తాత్రేయుడు, రామపరివారంతో సహా కార్యసిద్ధిఆంజనేయస్వామి, గిరీశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు.ఇటువంటి ఆలయాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. చింతామణి గణపతి ఉజ్జయిని నగరంలో స్వయంభువుగా వెలిశాడు. కాశీ నగరంలో దేవరాజైన ఇంద్రుడు చింతామణి గణపతిని ప్రతిష్ట చేసి పూజించాడు.

అతి పెద్ద ఆలయం

సిరసపల్లి గ్రామంలో ఉన్న ఆలయం భారతదేశంలోనే ఏకైక అతిపెద్ద చింతామణి గణపతి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. అనకాపల్లి నుంచి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో సిరసపల్లి గణపతి దత్త క్షేత్రం ఉంది. 3.5 ఎకరాల్లో ఈ ఆలయం ఏర్పాటైంది. దేశంలో వివిధ ప్రాంతాల భక్తులు ఇక్కడకు వచ్చి స్వామివారిని దర్శించుకుని రెండు రోజులు కుటుంబ సమేతంగా ఉండేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో కొండ పక్కన, జాతీయ రహదారికి కూసంత దూరంలో ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించుకుంటారు.

నేడు ఘనంగా ప్రతిష్టాపనోత్సవం

దేశవ్యాప్తంగా 64 గణపతి రూపాలు ఉండగా, చింతామణి గణపతి దత్తక్షేత్రంలో 32 గణపతి రూపాలను గురువారం ప్రతిష్టించనున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా విగ్రహాలను ఇక్కడ ప్రతిష్ట చేస్తున్నారు. ఇందుకోసం గురువారం చింతామణి గణపతి దత్తక్షేత్రానికి గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీలు రానున్నారు. ముందుగా 1008మంది దంపతులతో అనఘా వ్రతం చేసిన తరువాత గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీలు గణపతి విగ్రహాలను ప్రతిష్ట చేసి, ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించేందుకు క్షేత్ర ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

భక్తుల తాకిడి పెరుగుతోంది..

చింతామణి గణపతి దత్తక్షేత్రాన్ని 2012లో ఏర్పాటు చేశారు. రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. సుమారుగా 3.5 ఎకరాల్లో దత్త క్షేత్రం ఉండడంతో భక్తులకు మౌలికసదుపాయాలు కల్పించాం. దశల వారీగా దత్తక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో భక్తులకు ఉచిత అన్నసమారాధన జరుపుతున్నాం. 32 గణపతులు ఒకే ప్రదేశంలో ప్రతిష్ట చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– ఆంజనేయరాజు, చింతామణి గణపతి దత్తక్షేత్ర నిర్వాహకులు, సిరసపల్లి గ్రామం, అనకాపల్లి మండలం

వైభవంగా గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న నూకమహాలక్ష్మీ నాయుడు దంపతులు, పొలిమేర రవి దంపతులు


అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన శివలింగం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ఆలయంలో వార్షిక కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగి కొణతాల నూకమహాలక్ష్మినాయుడు దంపతులు, వ్యాపారవేత్త పొలిమేర రవి దంపతులతో ఆలయ పురోహితులు నేతేటి సుబ్రహ్మణ్య శర్మ ఈ కల్యాణాన్ని నిర్వహించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గవరపాలెం వీధుల్లో ఊరేగించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సారె ఊరేగింపు సంబరం

గవరపాలెం గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు సంబరం ఘనంగా జరిగింది. ఊరేగింపును ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, భీమరశెట్టి రాంకీలు ప్రారంభించారు. సతకంపట్టు వద్ద ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చినరామస్వామి కోవెల, పెదరామస్వామి కోవెల, సంతబయలు, దిబ్బవీధి, అగ్గిమర్రిచెట్టు ఘోషాస్పత్రి, చింతావారి వీధి, చిన నాలుగురోడ్ల జంక్షన్, చేపల బజార్, సత్యనారాయణ థియేటర్, ఆంధ్రా బ్యాంక్ రోడ్డు, పార్కుసెంటర్, వెంకన్న కొట్టుమీదుగా ఆలయానికి చేరుకుంది. వివిధ రకాల పిండివంటలు, మిఠాయిలు, కూరగాయలు, దుస్తులు, ఫర్నిచర్, బెల్లం దిమ్మలు, అరటిగెలలతో మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట వరప్రసాద్, కోశాధికారి కొణతాల మహాలక్ష్మినాయుడు, సహాయ కార్యదర్శులు పి.వి.రమణ, దాడి కృష్ణ, ఉప కోశాధికారి పెంటకోట వెంకట సత్యనారాయణ, కన్వీనర్లు మద్దాల శంకరరావు, సూరిశెట్టి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీల్లో క్రీడాకారుడిని పట్టుకున్న ప్రత్యర్థి జట్టు క్రీడాకారులు.


సీతంపేటలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను తిలకిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు

దేవరాపల్లి: సీతంపేటలో మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. సీతంపేట గ్రామ పెద్దలు, స్థానిక యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 జట్లు పాల్గొన్నాయి. బుధవారం సాయంత్రం ప్రారంభమైన ఈ పోటీలు అర్ధరాత్రి వరకు జరిగాయి. పోటీల కోసం విశాఖపట్నం నుంచి ప్రత్యేక మ్యాటిని తెప్పించారు. ఫ్లడ్ లైట్లు వెలుతురులో నిర్వహించిన పోటీలను తిలకించేందుకు సీతంపేటతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విజేతలకు రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 6వేలు, రూ. 4వేలు చొప్పున నగదు బహుమతులను స్థానిక గ్రామ పెద్దలు, యూత్ చేతులు మీదుగా అందజేయనున్నారు.

జాతీయ రహదారిపై అంబులెన్స్ బోల్తా

- రోగి సహా ఆరుగురికి గాయాలు
- నర్సీపట్నం నుంచి ఆరిలోవ హెల్త్‌సిటీకి తరలిస్తుండగా పెందుర్తి వద్ద ఘటన
- డ్రైవర్ మినహా బాధితులంతా ఒకే కుటుంబ సభ్యులు


అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై బోల్తా పడిన అంబులెన్స్


గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం


ప్రమాదంలో గాయపడిన చంద్రమ్మ, సర్వలక్ష్మి, జ్యోతి

పెందుర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి/అత్తను కాపాడుకునేందుకు కొడుకులూ కోడళ్లూ తాపత్రయపడ్డారు. తమ నివాస స్థలం నర్సీపట్నంలోని ఆస్పత్రిలో చేర్పించగా.. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు చెప్పారు. దీంతో విశాఖ నగరానికి తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌ను బుక్ చేశారు. ఆ అంబులెన్స్‌లో వస్తుండగా డివైడర్‌ను ఢీకొని అంబులెన్స్ బోల్తాపడటంతో రోగితోపాటు వెంట వెళ్లిన కొడుకులూ, కోడళ్లూ, అంబులెన్స్ డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.. నర్సీపట్నం పట్టణానికి చెందిన గంటా చంద్రమ్మ(70) శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించడంతో ఓ ప్రవేట్ అంబులెన్స్‌లో చంద్రమ్మను విశాఖ నగరంలోని ఆరిలోవ హెల్త్‌సిటీకి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అంబులెన్స్‌లో చంద్రమ్మ కుమారులు సూరిబాబు, పెద్దిరాజు, కోడళ్లు సర్వలక్ష్మి, జ్యోతి హెల్త్ సిటీకి వస్తున్నారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలో పెందుర్తి వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను అంబులెన్స్ ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో చంద్రమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సూరిబాబు, పెద్దిరాజు, సర్వలక్ష్మి, జ్యోతి సహా అంబులెన్స్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు 108లో క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చంద్రమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చనేతలకు జనసేన ఝలక్

- ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో బయటపడ్డ లుకలుకలు
- టీడీపీ ఫ్లెక్సీలు లేవని మాజీ ఎమ్మెల్యే పీలా అసహనం
- తమకు ఆహ్వానమే లేదన్న టీడీపీ నాయకులు


వెంకుపాలెంలో కూటమి నాయకుల మధ్య మాటల యుద్ధం

తుమ్మపాల : గ్రామాల్లో కూటమి నాయకుల కుమ్మలాట రోజురోజుకు బయటపడుతుంది. గ్రామాల్లో జనసేన నాయకులు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు మరే ఇతర పనులకు తమను పిలవడం లేదంటూ టీడీపీ నాయకులు రగిలిపోతున్నారు. కూటమి పాలనతో రాష్ట్రమంతా పాలన ఒకలా ఉంటే నియోజకవర్గంలో పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడ జనసేన పార్టీ నేతగా కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా కొనసాగడంతో టీడీపీ కార్యకర్తలకు దిక్కుమొక్కూ లేకుండా పోయిందని వాపోతున్నారు. కొన్ని రోజులుగా రగిలిపోతున్న వారి ఆవేదన ఇప్పుడిప్పుడే బయటపడుతుంది.

మండలంలో వెంకుపాలెం గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఎటుచూసినా జనసేన నేత కొణతాల ఫ్లెక్సీలే కనబడడం, టీడీపీ ఫ్లెక్సీలు లేకపోవడంతో అసహనం చెందిన పీలా గోవింద్ కారెక్కుతూ టీడీపీ నాయకులు ఒక్క ఫ్లెక్సీ కూడా వేయకపోవడం దారుణమంటూ చురకలు వేశారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహించిన టీడీపీ నాయకులు కార్యక్రమంపై జనసేన నాయకులు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని, అధికారంలోకి వచ్చి కూడా మిన్నకుండిపోవాల్సి వస్తుందని తమ గ్రామానికి ఎమ్మెల్యేతో పాటు మా నాయకుడు కూడా వస్తుంటే జనసేన నాయకులు మాత్రం తమకు కనీసం సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే కొణతాలను ప్రశ్నించారు.

గ్రామాల్లో తలెత్తుకు తిరగలేకపోతున్నామని, తక్షణమే సమావేశం పెట్టి ఇక నుంచైనా అన్ని కార్యక్రమాల్లో తమకు ముందుగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తానని చెప్పి ఎమ్మెల్యే వెళ్లిపోయినా టీడీపీ నాయకులు మాత్రం తగ్గలేదు. ఇకపై సమాచారం లేకుండా కార్యక్రమాలు చేస్తే తాడోపేడో తేల్చుకుంటామంటూ హెచ్చరించారు. దీంతో ఇరువర్గాల నడుమ మాటల యుద్ధం జరిగింది.

కూటమి ప్రభుత్వంలో గోవులకూ రక్షణ కరువు

- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ


విలేకర్లతోమాట్లాడుతున్న వీసం

నక్కపల్లి: కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోరక్షణ కంటే గోభక్షణ ఎక్కువగా జరుగుతోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతోమాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోమాంసం రవాణా యథేచ్ఛగా జరుగుతోందని తెలిపారు. గోవులను వధించి మాంసాన్ని ఇతర ప్రాంతాలకు, దేశాలకు రవాణా చేస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రం మీదుగా హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడనుంచి ఇస్లామిక్ దేశాలకు తరలిస్తున్నారన్నారు. గోవుల అక్రమ రవాణా కూడా మన రాష్ట్రం నుంచే అధికంగా జరుగుతోందని తెలిపారు. నాలుగు నెలల వ్యవధిలో నక్కపల్లి పోలీసులు రెండు పర్యాయాలు గోమాంసాన్ని తరలిస్తున్న కంటైనర్లు పట్టుకున్నారని తెలిపారు. నాలుగు నెలల క్రితం సుమారు ఆరువేల కిలోల పశుమాంసం తరలిస్తున్నవ్యాన్‌నుటోల్‌గేట్ సమీపంలో పట్టుకున్నారని, గతఏడాది పాయకరావుపేటలో సుమారు 10టన్నుల గోమాంసాన్ని పోలీసులు పట్టుకున్నారని, తాజాగా రెండు రోజుల క్రితం రూ.40లక్షల విలువైన 23 వేల కిలోల గోమాంసం ప్యాకెట్లను తరలిస్తున్న వ్యాన్‌ను వేంపాడు సమీపంలో పట్టుకున్నారన్నారు.

నిత్యం గోమాంసం జాతీయరహదారిమీదుగా రవాణా జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వ్యాన్‌లు, కంటైనర్ నంబర్లతో సహా ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసుల స్పందంచడం లేదన్నారు. పాయకరావుపేటనుంచి అనకాపల్లి వరకు జాతీయరహదారికి ఇరువైపులా నిర్వహిస్తున్న దాబాలు,హోటళ్లల్లో గోమాంసంతో వంటకాలు తయారుచేసి చేసి విక్రయిస్తున్నారన్నారు. నెలరోజుల క్రితం ఒడ్డిమెట్ట వద్ద ఉన్న పెట్రోలు బంక్ సమీపంలో ఉన్న దాబాలో గోమాంసం విక్రయిస్తుండగా సినీనటి, బీజేపీ నాయకులు కరాటే కల్యాణితదితరులు పట్టుకున్నారని తెలిపారు. జాతీయ రహదారిపక్కన ఉన్న దాబాలన్నింటిలో గోమాంసం విక్రయిస్తున్నారన్న విషయం అందరికీ తెలిసినప్పటికీ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా గోమాంసం రవాణాపై పోలీసు శాఖ దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

కూటమిప్రభుత్వంలో మనుషులతోపాటు, గోవులకు సహితం రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారపు సంతలనుంచి గోవులను అధిక సంఖ్యలోకొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారని, సంతల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గోవుల రవాణాకు పాల్పడే వ్యక్తులు పోలీసు శాఖతోపాటు ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు నెలవారీ మామూళ్లు చెల్లించడం వల్లే పట్టించుకోకపోగా సరిహద్దులు దాటించే వరకు సహకరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోందని వీసం తెలిపారు. ఈ సమావేశంలో పీఏపీఎస్ మాజీ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, స్థానిక నాయకుడు ఎల్లేటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

VEHICLE FOR SALE		
Vehicle no.	Make	Model
AP31TM2679	AL 3718 IL FBT	2018
AP35X7222	AL 3118 IL FBT	2016
AP07TG4856	AL 3118 IL FBT	2016
Contact: 9963081444		
SHRIRAM FINANCE LIMITED		

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాన్ డ్రైవర్ మృతి

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాన్ డ్రైవర్ షేక్‌బాషా గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ట్రాఫిక్ ఏఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు వివరాలు...ఈనెల 14న అనకాపల్లి జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి వ్యాన్ ఢీ కొనడంతో వ్యాన్ డ్రైవర్ షేక్‌బాషా(42) తీవ్రంగా గాయపడ్డాడు. ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని ఆయన కుమారుడు షేక్ గుంటూరు తీసుకు వెళ్లిపోయాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన నారాయణరావు


చిరంజీవినాయుడు

మాకవరపాలెం: రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని తామరం గ్రామానికి చెందిన కోసూరు నారాయణరావు, మరో బైక్‌పై ఉన్న రావికమతం మండలం కొత్తకోటకు చెందిన చిరంజీవినాయుడులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు


పట్టుబడిన నిందితులు

నాతవరం: కోడి పందాలు ఆడుతున్న వారిపై దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నట్టు నాతవరం ఎస్‌ఐ సీహెచ్. భీమరాజు తెలిపారు. మండలంలో గన్నవరం పంచాయతీ సమీపంలో కోడి పందాలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. వారి వద్ద నుంచి మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ వైర్లను లాక్కెళ్లిన కర్రల లారీ

- రెండు ఇళ్ల మీద పడిన విద్యుత్ స్తంభాలు

మాడుగుల రూరల్: మండలంలో అవురువాడ పంచాయతీ శివారు పెదసారాడ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి సర్వే కర్రల లారీ బీభత్సం సృష్టించింది. సీతబందలు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న లారీపైన ఉన్న కర్రలకు విద్యుత్ వైర్లు తగలడంతో, వైర్లతో పాటు విద్యుత్ స్తంభాలను లాక్కెళ్లింది. దీంతో రెండు స్తంభాలు ఇళ్లమీద పడడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక విద్యుత్ స్తంభం ఓనుపూరి రాజుబాబు ఇంటి మీద, మరో విద్యుత్ స్తంభం పందిరి ఈశ్వరరావు ఇంటి మీద పడ్డాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటన కారణంగా గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు చదల కృష్ణదొర ఈ విషయాన్ని స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు బుజ్జిబాబుకు సమాచారం అందించడంతో ఆయన విద్యుత్ టాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు.

విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి


సంఘటన స్థలంలో శివాజీ

రోలుగుంట: పంటభూమలకు సాగు నీరందించే మోటారుకు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ రోకళ్ల శివాజీ(20) మృతి చెందిన సంఘటన శరభవరం గ్రామంలో బుధవారం జరిగింది. సర్పంచ్ పంచాడ సూర్యచంద్ర సమాచారం మేరకు ఎస్‌ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన పొలంలో ఉన్న మోటారు పనిచేయకపోవడంతో దానిని బాగు చేయడానికి గ్రామానికి చెందిన పెద్దింటి రమణ అనే రైతు ఎలక్ట్రీషియన్ కోళ్ల శివాజీని తీసుకెళ్లాడు. శివాజీ విద్యుత్ స్తంభం ఎక్కి చూస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. పెద్దింటి రమణ గ్రామస్తులకు తెలపడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శివాజీ మృతిచెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు.దీనిపై మండల విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ మాట్లాడుతూ శివాజీ విద్యుత్‌శాఖ ఉద్యోగి కాదని, ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేశామని చెప్పారు.

భర్తపై అనుమానంతో భార్య ఆత్మహత్య


మృతురాలు శిరీష(ఫైల్)

నర్సీపట్నం: భర్తపై అనుమానంతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపిన వివరాలు... నర్సీపట్నం మున్సిపాలిటీ ధనిమిరెడ్డి వీధికి చెందిన ప్రసాద్‌తో శిరీషకు సుమారు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి ఇద్దరు పిల్లలున్నారు. ప్రసాద్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో శిరీష తరచూ గొడవపడేది. గొడవలు పడొద్దని ఆమె తల్లిదండ్రులు కూడా నచ్చజెప్పారు. భర్త ఇంట్లో లేని సమయంలో మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గోవింద రావు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు

అనకాపల్లి/కశింకోట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగరం కోర్టువీధిలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌లు బుధవారం కేక్ కట్ చేశారు. పేదలకు వస్త్రాలు, భోజన ప్యాకెట్లు, స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షులు 1,2 ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ మునూరు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దొడ్డి హరి, నడిశెట్టి మధు, గైపూర్ రాజు, శ్రీధరాల మనోజ్, కొమ్మన శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అమరనాథ్ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు, కొత్తలైన్ల ఏర్పాటు నిమిత్తం 11 కేవీ లక్ష్మీనారాయణనగర్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెయ్యిలవీధి, పెరుగు బజార్ జంక్షన్, పల్లపువీధి, చేపల బజార్ ఏరియా, మసీదువీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గుళ్లాట నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో దాడి చేసి గుళ్లాట నిర్వహిస్తున్న నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రూ.3,550 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 5,349 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,210	5,500
మొదటి రకం	3,540	4,110
రెండో రకం	3,070	3,750
మూడోరకం	2,840	3,050

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
గేమ్ ఛేంజ్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
డాకు మహారాజ్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-22 యూనిట్లు, ఒ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 376 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 291 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

దారిద్ర్యం వీడేనా?





అధ్వానంగా ఉన్న రోడ్డు

కశింకోట: మండలంలోని జోగారావుపేట–గణపర్తి రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అడుగుకో గొయ్యి ఉండడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, రైతులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఇక వర్షం పడితే వారి అవస్థలు వర్ణనాతీతం. అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడే రోడ్డును వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విస్తరించి మెటల్ వేసి అభివృద్ధి చేశారు. ఆ తర్వాత తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ రైతుల అభ్యంతరంతో ముందుకు సాగలేదు. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడక తప్పడం లేదు. మండలంలోని మారుమూలన పేరంటాలపాలెం శివారులో జోగారావుపేట గ్రామం ఉంది. ఈ గ్రామానికి ఒకవైపు పేరంటాలపాలెం నుంచి సుమారు రెండు కిలో మీటర్ల పొడవునా ఏడేళ్ల క్రితం తారు రోడ్డును వేశారు. అయితే మరోవైపు జోగారావుపేట నుంచి గణపర్తి (మునగపాక మండలం) వరకు ఉన్న రెండు కిలో మీటర్ల రోడ్డును మాత్రం వేయలేదు. దీంతో పొలాల మధ్య ఉన్న ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తే జోగారావు పేట గ్రామస్తులకు పూర్తి స్థాయి రవాణా సదుపాయం కలగడమే కాకుండా మునగపాక మండలంలోని ఉన్న చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాలకు దూరం తగ్గనుంది. ప్రస్తుతం ఆయా గ్రామస్తులు అనకాపల్లి నుంచి ఒక వైపు నరసింగబిల్లి,మరో వైపు కొండకర్ల మీదుగా సుమారు 18 కిలో మీటర్ల మేర దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జోగారావుపేట–గణపర్తి మధ్య తారు రోడ్డు అభివృద్ధి చేస్తే ఐదారు కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. మండలంలోని బయ్యవరం, తేగాడ, పేరంటాలపాలెం గ్రామస్తులు అచ్యుతాపురం, తిమ్మరాజుపేట, హరిపాలెం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి దూరం తక్కువ అవుతుంది. సమయం ఆదా అవుతుంది. ఇప్పుడు ఆయా ప్రాంతాలకు దూరంగా ఉన్న అనకాపల్లి మీదుగా చేరుకోవలసి వస్తోంది.

విద్యార్థులు,ఉద్యోగులకు తప్పని కష్టాలు

జోగారావుపేటకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు గణపర్తి హైస్కూలులో చదువుతున్నారు. వారితో పాటు అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలోని పరిశ్రమల్లో పని చేసే ఇక్కడి ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జోగారావుపేట–గణపర్తి మధ్య తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్ల ఉపాధి హామీ పథకం నిధుల నుంచి మంజూరు చేయించారు. దీంతో రోడ్డు విస్తరించి మెటల్ వేశారు. అనంతరం తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తుండగా కొందరు రైతులు రోడ్డుకు భూములు ఇవ్వడానికి అభ్యంతరం తెలపడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇక పనులు ముందుకు సాగలేదు. ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఇబ్బందులను ఎదుర్కోక తప్పడం లేదు. ప్రధానమైన రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఇప్పటి కూటమి ప్రభుత్వం ఇంకా ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని తారు రోడ్డుగా అభివృద్ధి చేసి తమ ఇబ్బందులను తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల తరలింపులో ఇబ్బందులు

జోగారావుపేట–గణపర్తి రోడ్డులో ఆయా గ్రామాల రైతులతోపాటు చూచుకొండ రైతుల పొలాలు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు అధ్వానంగా ఉండి వాహనాలు దిగబడి పోతుండడంతో వ్యవసాయ ఉత్పత్తులను తమ ఇళ్లకు, అనకాపల్లికి తరలించడానికి రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బెల్లం తయారీ సీజన్‌లో అయితే బెల్లాన్ని మార్కెట్‌కు తరలించడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

నరకయాతన పడుతున్నాం



జోగారావుపేట–గణపర్తి రోడ్డు అధ్వానంగా ఉంది. గోతులతో నిండి పోయింది. రాకపోకలు సాగించడానికి నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది. వర్షం వస్తే అడుగు తీసి అడు వేయలేని పరిస్థితి. మూడేళ్ల క్రితం అర్ధంతరంగా నిలిచిపోయిన రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేసి కష్టాలు తీర్చడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

–మజ్జి శ్రీను, జోగారావుపేట.

తారు రోడ్డు నిర్మించాలి



జోగారావుపేట–గణపర్తి రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి. ఇది అనకాపల్లి వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి దగ్గరి దారి.రోడ్డు బాగుండకపోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. దీంతో నరసింగబిల్లి మీదుగా అనకాపల్లి చేరుకోవలసి వస్తోంది. అదనంగా ఐదారు కిలో మీటర్ల దూరం ప్రయాణించవలసి వస్తోంది.

–మారిశెట్టి వెంకట రమణ, గణపర్తి

గతుకులమయంగా రోడ్డు



జోగారావుపేట ప్రాంతంలో ఎక్కువగా తమ పంట భూములున్నాయి. వాటిలో వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకోవడానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటాం. అయితే రోడ్డు గతుకులతో నిండి దిగబడి పోతుండడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లు, మార్కెట్‌కు తరలించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. దీనిని తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

– పెంటకోట సుజాత, రైతు, చూచుకొండ

ప్రతిపాదనలు పంపుతాం

జోగారావుపేట–గణపర్తి రోడ్డు అభివృద్ధికి ఇంకా ప్రతిపాదించలేదు. కొత్తగా అంచనాలు తయారు చేసి రానున్న యాక్షన్ ప్లాన్‌లో పొందుపరచడానికి చర్యలు తీసుకుంటాం. నిధులు మంజూరు అయిన తర్వాత పనులు నిర్వహించడానికి చర్యలు చేపడతాం.

–వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, అనకాపల్లి

10 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు సిఫారసు



లైసెన్స్ రద్దుకు ఆన్‌లైన్‌లో సిఫారసు చేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్విచక్రవాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. స్థానిక జాతీయ రహదారి నూకాంబిక ఆర్చ్‌వద్ద ద్విచక్రవాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ రెండో సారి పట్టుబడిన 10మంది ద్విచక్ర వాహనదారులకు 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్సులు నిలుపుదల చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్టు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పదో తరగతి నమూనా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ప్రైవేట్, ప్రభుత్వ హైస్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల ఫలితాలను పది రోజుల్లో విడుదల చేయనున్నట్టు చెప్పారు. పరీక్షల్లో మొదటి 15 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.నూకరాజు, వినయ్,రాజు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: భూముల రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మండలంలోని తీడ పైలెట్ గ్రామంగా ఎంపికైన సందర్భంగా బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ఏడు బృందాలుగా ఏర్పడి 4 నెలల పాటు సర్వే చేయనున్నారని చెప్పారు. సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలరావు మాట్లాడుతూ రీ–సర్వే కార్యక్రమంలో అన్ని భూములను సమగ్రంగా సర్వే చేస్తామని, ఇది విజయవంతం అయితే మిగిలిన గ్రామాల్లో చేపడతామన్నారు. ఒక్కో బృందానికి 250 ఎకరాల చొప్పున ఇక్కడ సర్వేకి అప్పగించామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మండల సర్వేయర్ రామారావు, రీ–సర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

26న రైతు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ



మోర్చా ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న ర్యాలీ నిర్వహించనున్నట్టు రైతు కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో కిసాన్ మోర్చా ర్యాలీ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిపబ్లిక్‌డే సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టాలని రైతు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మోడీ పాలనలో రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, పేద ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా నాయకుడు గాడి బాలు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు, ఏపీ రైతు సంఘాల నాయకులు గండి నాయనబాబు, తేలయ్యబాబు, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శ్రీరామ నామస్మరణ



ఎం.జగన్నాథపురంలో శ్రీరాముని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వాడ్రాపల్లి రామాలయంలో సామూహిక దీపారాధనలో భక్తులు

మునగపాక: వాడ్రాపల్లిలో బుధవారం రాత్రి శ్రీరామ నామస్మరణ మార్మోగింది. పెదరామస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో బాల రామున్ని ప్రతిష్ఠించి ఏడాది కావడంతో సామూహిక హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామస్మరణ చేశారు.

జగన్నాథపురంలో శ్రీరాముని విగ్రహ ఊరేగింపు

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో శ్రీరాముని విగ్రహాన్ని ఊరేగించారు. అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగంగా బాల రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామ వీధుల్లో బాల గణపతి భజన బృందం సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భజనలు చేసుకుంటూ స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బంటు రాము, మట్టా సర్వాలక్ష్మి, బంటు ఆనంద్, పీలా శ్రీను, కొమిరెడ్డి బాబ్జి, సేనాపతి కాశీనాయుడు, సేనాపతి పెద్దరాయుడు, బుదిరెడ్డి కన్నకుమార్, పైలా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు మేడ సమర్పణ



మేడ సమర్పణలో భాగంగా ఊరేగింపు చేస్తున్న చెరువు కాలువ సంఘ రైతులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో బుధవారం రాత్రి గౌరీపరమేశ్వరులకు మేడ సమర్పణ ఘనంగా జరిగింది. మునగపాకకు చెందిన చెరువు కాలువ సంఘ రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో అరటి గెడలు, బెల్లం, చెరకు దుబ్బులు, ఇతర పంటలను సేకరించి ఆలయానికి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. వచ్చే నెల 1న గౌరీపరమేశ్వరుల ఉత్సవం జరగనున్న నేపథ్యంలో సంప్రదాయం ప్రకారం మేడ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆడారి జగ్గారావు, వెలగా వెంకట్, దాడి చంద్రరావు, దాడి సూరప్పారావు, వెలగా అప్పలనాయుడు, బీవీఎస్ నారాయణ, దాడి అప్పారావు, వెలగా ధర్మసూరి అప్పారావు, వెలగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

24న కశింకోటకు దివ్య రథం

కశింకోట: మండల కేంద్రం కశింకోటకు ఈ నెల 24వ తేదీ సాయంత్రం దివ్య స్వర్ణిమ రథం రానుందని స్థానిక బ్రహ్మ కుమారీ ప్రతినిధులు కోరుబిల్లి ధనలక్ష్మి, ఆడారి రూప తెలిపారు. పరమాత్మ తెలియజేసే సత్య గీత జ్ఞానం, సహజ రాజ యోగ శిక్షణ ద్వారా నైతిక విలువలను పెంపొందించి అందరి జీవితాల్లో సుఖ శాంతులు నెలకొల్పాలన్నదే ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. రథయాత్ర పంచాయతీ కార్యాలయం వద్ద కోలాటాలు, భజనలతో ప్రారంభమై గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగుతుందన్నారు. భక్తులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

అనకాపల్లి: మండలంలో తగరంపూడి గ్రామంలో కోడి పందాలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ రవికుమార్ బుధవారం చెప్పారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా లాలం కోడూరు తీర్థం



ఉత్సాహంగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో లాలం కోడూరు గ్రామంలో లాలం ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మ దంపతుల తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఈ ఉత్సవంలో సందడి చేశారు. పరస సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. తీర్థంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం, తోడపెద్దు సేవ, సాము గరిడీలు, తప్పెటగుళ్లు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



సుంకపూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి ప్రారంభించగా.. అప్తాలమిక్ ఆఫీసర్ జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్.అశ్వనికుమార్ మాట్లాడుతూ 53 మందికి కంటి పరీక్షలు చేయగా.. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. వారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలం సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు సింగంపల్లి బాబులు, సింగంపల్లి శ్రీనివాసు, లాలం లచ్చాపాత్రుడు, లాలం బాబులు, నర్సింగ్ స్టాఫ్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

205 పశువులకు వైద్య సేవలు



కన్నూరుపాలెంలో పశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి దయానా



నరసింగబిల్లిలో ఆవును పరీక్షిస్తున్న వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించి 205 పశువులకు వైద్య సేవలందించారు. కన్నూరుపాలెం పశు వైద్య కేంద్రంలో వైద్యాధికారి దయానా పది పశువులకు గర్భ కోశ పరీక్షలు, ఆరు ఎదకు రాని పశువులకు, 25 పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. 50 గొర్రెలు, 40 దూడ పెయ్యిలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించి, పరిశీలించారు. శిబిరాలపై అవగాహన కలిగిస్తూ రూపొందించిన కర పత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, కూటమి నాయకులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నరసింగబిల్లి పశు వైద్య కేంద్రంలో వైద్యాధికారి సీహెచ్. చైతన్యమణి పది పశువులకు గర్భ కోశ పరీక్షలు చేశారు. ఎనిమిది ఎదకు రాని పశువులు, 18 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. 40 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందజేశారు. వైద్య శిబిరాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మజ్జి నిరంజన్‌కుమార్, పశు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పు గల్లీల నిర్వహణకు వేలం వేయరా?



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం: రేవుపోలవరం సమీపంలో ఉప్పు గల్లీల లీజు గడువు ముగిసినా.. వేలం నిర్వహించకపోవడం దారుణమని వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పలరాజు ధ్వజమెత్తారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉప్పు పరిశ్రమ ఉందని, ఆ గల్లీ నిర్వహణ దశాబ్దాలు కాలంగా ఒకే కుటుంబానికి చెందిన వారు చేస్తున్నారన్నారు. సుమారు 384 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో కొంత మేర ఉప్పును పండిస్తున్నారన్నారు. 2021 నాటికి లీజు ముగిసినప్పటికీ మళ్లీ వేలం నిర్వహించకుండా పాత వ్యక్తులతోనే సాగు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై కోర్టులో పిటిషన్ వేశామన్నారు. రెండు నెలలు కాల వ్యవధి ఇచ్చి వేలం నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఆ గడువు ఈ నెల 8వ తేదీతో ముగిసిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఉప్పు పరిశ్రమ నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు.

తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు చూపాలి



సత్కారం పొందిన దంపతులు

మునగపాక: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల ప్రేమానురాగాలు చూపాలని శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం రాత్రి గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో 60 సంవత్సరాలు దాటిన 16 మంది దంపతులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ బలహీనపడుతోందని, తల్లిదండ్రుల పట్ల గౌరవం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి దశలో తల్లిదండ్రులను ఎంత బాగా చూసుకుంటే మనకు కూడా మంచి జరుగుతుందన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మళ్ల వరహీ నరసింగరావు, మళ్ల జోగినాయుడు, మళ్లసంతోష్, యల్లపు అప్పలనాయుడు, శరగడం గణేష్, పాల్గొన్నారు.